# ఎలా వుంటుంది?

(ఆంధ్రజ్యోతి సచిత్ర వార పత్రిక 25-9-87)

ఆదివారం ఉదయం తొమ్మిదిన్నర గంటలు ఎప్పుడెప్పుడౌతుందా అని ఆత్రంగా ఎదురు చూస్తూ కూర్చున్నారు బామ్మగారు. రోజూ కంటే ముందుగానే లేచి స్నానం, పూజ వగైరా కార్యక్రమా లన్నీ పూర్తి చేసుకుని మడిబట్ట ఆరేసుకుని వచ్చి టి.వి. ముందు కూర్చోవడం గత ఆరు ఆదివారాల నుంచీ బాగా అలవాటయింది బామ్మగారికి. టి.వి.లో వచ్చే హిందీ రామాయణ కార్యక్రమం బామ్మగారి శ్రద్ధకి, ఆత్రుతకి కారణం.

రామాయణ కార్యక్రమం ప్రారంభం అయ్యేవరకు వచ్చేవివిధ ప్రకటన కార్యక్రమాలన్నింటినీ ఎప్పుడు అయిపోతాయా అన్నట్టు అయిష్టంగా చూస్తూ కూర్చున్న బామ్మగారికి సరిగ్గా రామాయణకార్యక్రమం ప్రారంభం అయ్యే సమయానికి కరెంట్ పోతే ఎలావుంటుంది?

ఉక్రోషం పట్టలేని బామ్మగారు ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంటు మొత్తాన్ని తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టడం మొదలుపెట్టారు.

"బూతు సినిమాలు, బూతు పాటలు, చూపేటప్పుడు వీళ్ళకి కరెంట్ తీయాలనిపించదు, పాపం వాళ్ళా కళ్ళలో వత్తులు వేసుకు చూడాలిగా ఆ పాడువన్నీ. అందుకని అప్పుడు కరెంట్ తియ్యడానికి వాళ్ళకి చేతులు రావు. వీళ్ళ చేతులు పడిపోను."

"ఈ రామాయణాలు, భారతాలు ఎవరిక్కావాలి. నా బోటి ముసలిచచ్చినాళ్ళ చూద్దాం గదాని కూర్చుంటే ఇదీ వరస. పిదపకాలం పిదపబుద్ధులు. ఏం చేస్తాం." తిట్టుకుంటూనే వంటపనిలోకి వెళ్లారు బామ్మగారు.

"ఉదయం అనగా పోయిన కరెంటు ఇంతవరకు రాలేదు. ఆదివారం ఒక్కరోజన్నా టి.వి. ప్రోగ్రామ్స్ చూద్దాంకదా అనుకుంటే సరిగ్గా ఆదివారమే కరెంట్ తీసేస్తారు దరిద్రులు. పైగా ఈ రోజు నుంచి కన్నడ సినిమా కూడా వుంది. కరెంట్ కోత ఎత్తివేశామంటూ పేపర్లో వార్తలు వీళ్ళవరస మాత్రం మామూలే" ఉడుక్కున్నాడు బొమ్మగారి కొడుకు. వారం అంతా కేంపులంటూ తిరిగి ఆదివారం ఇంటికి చేరి హాయిగా టి వి. చూద్దాం అనుకున్న అతనికి మరీవిసుగ్గా వుండక ఎలా వుంటుంది ?

"హేపీగా క్రికెట్ చూద్దామనుకుంటే కరెంట్ తీసేశాడన్నమాట. పగలంతా వీధిదీపాలు వెలగనిచ్చి రాత్రయ్యేసరికి కరెంట్ కోతంటూ దీపాలార్పే రకం ఇంతకన్నా ఏం చేస్తారు ?" అక్కసు వెళ్ళబోసుకున్నాడు ఇంటికి వచ్చిన మిత్రుడితో క్రీడాభిమాని అయిన బొమ్మగారి మనవడు.

ఇది ఒక్క బొమ్మగారింట్లో విషయం మాత్రమే. ఆ పేటలో ఇలాంటి ఇళ్ళు ఎన్నో. ఒక్కొక్క ఇంటిలో ఎంతమంది ఫ్యాను గాలి కోసం, రేడియో పాటల కోసం, టి. వి. ప్రోగ్రామ్స్ కోసం ఎందరెందరో ఎన్ని రకాలుగానో అక్కసు వెళ్ళబోసుకున్నారు.

ఇలా రకరకాలుగా నోటికి ఇష్టం వచ్చినట్లు తూలనాడే వాళ్ళ మాటలన్నీ ఉదయం నుంచీ మండే ఎండలో, సుత్తిదెబ్బల్ని భరిస్తూ బరువుల్ని మోస్తూ, దీక్షగా, టౌను మొత్తానికి సంబంధించిన ఒకపెద్ద ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర పని చేస్తున్న దాదాపు ఎనభై, తొంభై మంది కార్మికులకు వినబడితే ఎలా వుంటుంది ?

— () —

24.1.03